సాక్షి ఒడిశా

బుధవారం । 19 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 4,84,708
బంగారం	780 మిల్లీ గ్రాములు
వెండి	29 గ్రాముల 750 మిల్లీ గ్రాములు

\- భువనేశ్వర్/పూరీ



కూలిన ప్లై ఓవర్

- 8లో



మల్కన్‌గిరి జిల్లాలో భారీ వర్షాలు

- 8లో

న్యూస్‌రీల్

భూ ఆక్రమణలపై ఫిర్యాదు



రిజిస్టర్ దస్తావేజులతో బాధితులు

జయపురం: పేదలకు దానం చేసిన ఇళ్ల స్థలాలను కొంతమంది ఆక్రమించారని, ఆ స్థలాలను కాపాడి పేదలకు అందజేయాలని సామాజిక కార్యకర్త బి.హరిరావు కోరారు. ఈ మేరకు బాధితులతో సబ్ కలెక్టర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రసాదరావుపేటకు చెందిన దివంగత ముగడ నారాయణ కుమారుడు ముగడ సూర్యానారాయణ జగన్నాథపూర్ మౌజ, టంకువ గ్రామ పంచాయతీల్లోని 2 ఎకరాల 30 సెంట్లను కొంతమంది పేదలకు ఇళ్లు కట్టుకునేందుకు దానం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లబ్ధిదారులైన వ్యక్తుల పేరిట స్థలాలు రిజిస్టర్ చేశారన్నారు. అయితే ఆ స్థలం పక్కనే స్థలం ఉన్నటువంటి కొంతమంది వ్యక్తులు దానంగా ఇచ్చిన స్థలాన్ని ఆక్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్థలాలు ముగడ సూర్యనారాయణవి కాదని చెబుతూ అతడిని సైతం బెదిరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టి, లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.

నకిలీ వైద్యుడు అరెస్టు



మాట్లాడుతున్న ఎస్పీ సార్వణ్ వివేక్



నకిలీ వైద్యుడిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరానికి సమీపంలోని గంజాం జిల్లా డెంగబస్త గ్రామంలో బాబులి క్లీనిక్ నడిపిస్తున్న నకిలీ వైద్యుడిని దిగపండి పోలీసులు అరెస్టు చేసినట్లు సోమవారం సాయంత్రం బరంపురం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డా.సార్వణ్ వివేక్ వెల్లడించారు. వైద్యుడు సుబ్రజిత్ పండా నుంచి నకిలీ డాక్టర్ పుస్తకాలు, విజిటింగ్ కార్డులు, బ్యానర్లు, ఆధార్ కార్డు, కారు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతదేహం



చెట్టుకు వేలాడుతున్న రంజన్ దొళాయి మృతదేహం

జయపురం: అనుమానస్పద స్థితిలో ఒక యువకుడి మృతదేహం చెట్టుకు వేలాడుతూ పోలీసులకు కనిపించింది. జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి సదర్ పోలీసులు పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో వారికి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భూతనాథ్ శ్మశానవాటిక రోడ్డులో ఒక బైక్ రోడ్డుపై ఉండడం కనిపించింది. రాత్రివేళ అక్కడ బైక్ ఎవరు ఉంచారో తెలుసుకునేందుకు ఆ ప్రాంతమంతా గాలించారు. అప్పుడు వారికి ఆలయం వెనుక ఉన్న ఒక చెట్టుకు వేలాడుతూ యువకుడి మృతదేహం కనిపించింది. వెంటనే జయపురం సదర్ పోలీసుస్టేషన్‌కు తెలియజేయగా పోలీసు అధికారి ఈశ్వర తండి కొంతమంది పోలీసులతో అక్కడికి చేరుకున్నారు. యువకుడు ఎవరన్నది తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు. అతడు కుంద్రా సమితి చెందిన రంజన్ దొళాయిగా నిర్ధారించారు. కొంతకాలంగా రంజన్ జయపురంలో బంధువుల ఇంటిలో ఉంటూ ఒక సెల్‌ఫోన్ దుకాణంలో పనిచేస్తున్నాడని, ఈనెల 16 తేదీ సాయంత్రం 5 గంటలకు బయటకు వెళ్లి అప్పటినుంచి కనిపించడం లేదని బంధువులు పేర్కొన్నారు. పోలీసులు యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపించి, అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పెరుగుతున్న నీటిమట్టం

జిల్లాలోని గుణుపూర్‌లో వంశధార నది నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నది ఉధృతి పెరిగింది. గడిచిన 8 గంటల్లో నీటిమట్టం 80.49 మీటర్లకు చేరుకుంది. అలాగే సోమవారం రాయగడ సమితిలో 28.8 మి.మీ, కొలనారలో 21.4 మి.మీ, కల్యాణ సింగుపూర్‌లో 34.4 మి.మీ, కాసీపూర్‌లో 49.0 మి.మీ, గుణుపూర్‌లో 31.0 మి.మీ, పద్మపూర్‌లో 11 మి.మీ, గుడారిలో 19.5 మి.మీ, రామనగుడలో 28.2 మి.మీ, బిసంకటక్‌లో 14.2 మి.మీ, మునిగుడలో 32.7 మి.మీ, చంద్రపూర్‌లో 28.6 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలియజేశారు.

\- రాయగడ



పుస్తకాల వితరణ



గజపతి జిల్లా బీజేడీ పార్టీ నాయకుడు రూపేష్ పాణిగ్రాహి తన పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక దోలా ట్యాంకు రోడ్డులో ఉన్న నవజీవన్ అనాథాశ్రమంలో బాలికలకు పుస్తకాలు, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం గుమ్మాలో ప్రభుత్వ నిస్సాన్‌సంలోం చిల్డ్రన్ హోమ్‌లో సైతం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు రాష్ట్ర బీజేడీ కార్యదర్శి మారుత్ పాలో, యువనేత జి.విజయకుమార్, నవజీవన్ అనాథాశ్రమం సెంటర్ ఇన్‌చార్జి ఎస్వీ రమణ తదితరులు ఉన్నారు.

\- పర్లాకిమిడి

సామూహిక కుంకుమ పూజలు

స్థానిక మార్తపేట వీధిలో రెండు రోజులుగా జరుగుతున్న రామలింగ చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సిద్ధేశ్వర స్వామి కల్యాణ మండప ప్రాంగణంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెలుగు మహిళలు సంప్రదాయబద్ధంగా పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో వేద మంత్రాల మధ్య అమ్మవారికి ప్రభాతసేవ, దేవతార్చన, బాలభోగం, హోమం, 12 గంటలకు మహాభోగం జరిగాయి. సాయంత్రం సంధ్యాకాలార్చన, మంగళ హారతి, వేదస్వస్తి, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమంలో పూజ కమిటీ ప్రతినిధులతో పాటు సిద్ధేశ్వర స్వామి కల్యాణ మండపం చైర్మన్ టి.గోపి తదితరులు పాల్గొన్నారు.

\- బరంపురం



తప్పిన ఘోర ప్రమాదం

- లూప్ లైన్‌కి వెళ్లిన మెమూ రైలు
- అప్రమత్తమైన లోకో పైలట్
- రైలు నిలిపి సిగ్నిల్ అవుట్ పోస్టుకు సమాచారం
- అనంతరం మెయిన్ ట్రాక్‌కు రైలు
- రైళ్ల రాకపోకలకు స్వల్ప అంతరాయం



లూప్ లైనులోకి వెళ్లిన మెమూ రైలు

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా నీలగిరి రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో బరుణ్ సింగ్ ఛక్ వద్ద మంగళవారం ఘోర రైలు ప్రమాదం తప్పింది. విధి నిర్వహణలో ఉన్న లోకో పైలట్ సమయస్ఫూర్తితో ఇది సాధ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. భద్రక్ నుంచి బాలాసోర్‌కు బయల్దేరిన మెమూ రైలు మంగళవారం మధ్యాహ్నం నీలగిరి రోడ్ స్టేషన్‌కు చేరుకోగా, ట్రాక్‌లో కొన్ని సాంకేతిక లోపాల కారణంగా అది లూప్ లైన్‌లోకి ప్రవేశించింది. ఈ లోపాన్ని గుర్తించిన డ్రైవర్ (లోకో పైలట్) వెంటనే రైలును నిలిపివేసి సిగ్నల్ అవుట్ పోస్టుకు సమాచారం అందించాడు. ట్రాక్ లోపాన్ని సవరించిన తర్వాత రైలును లూప్ లైన్ నుంచి మెయిన్ ట్రాక్‌కి తీసుకెళ్లి ఘోర ప్రమాదం తొలగించాడు. ఈ రైలులో సుమారు 400 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

లోపాన్ని గమనించి అప్రమత్తం

ట్రాక్ నిర్వహణ పనులు జరుగుతున్న లూప్ లైన్‌లోకి మెమూ రైలు ప్రవేశించిన తర్వాత, ట్రాక్ వెనుక ఉన్న పాయింట్ వద్ద లోపాన్ని గమనించిన లోకో పైలట్ అప్రమత్తమై బ్రేక్ వేశాడు. ఆ తర్వాత అతను అవుట్ పోస్టుకు సమాచారం అందించి, రైలును వెనక్కి తిప్పి ప్రధాన ట్రాక్‌పైకి మళ్లించడంతో ముప్పు తప్పింది. ఈ మార్గంలో తాత్కాలికంగా ఇతర రైళ్ల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. రైలు నామమాత్రపు వేగంతో కదులుతుండగా సాంకేతిక సమస్యలతో ట్రాక్ నుంచి కొంత దూరంలో ఆగిపోయింది. దాదాపు 200 నుంచి 300 మీటర్ల వరకు వెనుకకు తిప్పాల్సి వచ్చిందని ఒక ప్రయాణికుడు తెలిపాడు.

పట్టాలు తప్పే అవకాశం లేదు: లోకో పైలట్

మెమూ రైలు లోకో పైలట్ ఉమేష్ పండా అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైలు గంటకు 7 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నందున పట్టాలు తప్పే అవకాశం లేదని, అయితే పట్టాలు దెబ్బతినే అవకాశం ఉండేదన్నారు. పైలట్ సమాచారం ప్రకారం ఈ మార్గంలో సిగ్నలింగ్ లోపం ఉన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఆయన అప్రమత్తంతో రైలు బాలాసోర్‌కు చేరుకోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. తమ ప్రాణాలను కాపాడిన లోకో పైలట్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రమాదం నుంచి బయటపడిన మెమూ రైలు భద్రక్ నుంచి బాలాసోర్‌కు వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ మేరకు రైల్వే శాఖ ఇంకా వివరణ ఇవ్వలేదు. అయితే రైల్వే శాఖ తరుచూ నిర్లక్ష్యంపై సర్వత్రా విచారం వ్యక్తమవుతోంది. ఈ తీరుతో రైలులో ప్రయాణం అంటే భయాందోళన కలిగిస్తుందని పలువురు వ్యాఖ్యానించారు.

ఒడిశాకు భూమి సమ్మాన్ అవార్డు



భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భూమి సమ్మాన్ అవార్డు గ్రహీతల బృందం



రాయగడ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ సింగ్



కొరాపుట్: రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న అధికారులు



పర్లాకిమిడి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న బీరేంద్ర కుమార్ దాస్

భువనేశ్వర్: కేంద్ర ప్రభుత్వ డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్ (డీఐఎల్ఆర్‌ఎంపీ) అమలులో ఉత్తమ రాష్ట్రంగా ఒడిశాకు 'భూమి సమ్మాన్' అవార్డు లభించింది. మంగళవారం న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డును రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సత్యబ్రత్ సాహుకు అందజేశారు. డీఐఎల్ఆర్‌ఎంపీ ప్రామాణికలను పటిష్టంగా అమలు చేసి ఒడిశా ఉత్తమ రాష్ట్రంగా అవార్డును కైవసం చేసుకుంది. దేశంలో సమగ్రంగా 766 జిల్లాలకు ఈ అవార్డు ప్రదానం చేశారు. లోగడ 68 జిల్లాలు ఆరు వేర్వేరు విభాగాల్లో ప్లాటినం అవార్డును గెలుచుకున్నాయి. ఈ జాబితాలో రాష్ట్రం నుంచి 19 జిల్లాలు ఉండడం విశేషం. అంగుల్, బౌధ్, బర్‌గడ్, భద్రక్, దేవ్‌గఢ్, ఢెంకనాల్, గజపతి, గంజాం, జగత్‌సింగ్‌పూర్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కెంజొహర్, ఖుర్దా, కొరాపుట్, నవరంగ్‌పూర్, రాయగడ, నయాగఢ్, నువాపడా జిల్లాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 5టీ మరియు మో సర్కార్ కార్యక్రమం కింద భూమి రికార్డుల డిజిటలైజేషన్‌లో ఒడిశా అగ్రగామి రాష్ట్రంగా నిలిచింది. 34 ప్రభుత్వ సేవలను డిజిటల్ మాధ్యమం ద్వారా దరఖాస్తుల దాఖలు, పరిశీలన తదనంతర కార్యాచరణ పనులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో వర్చువల్ కోర్టుల ద్వారా 13,000కు పైగా భూ సంబంధిత కేసులు పరిష్కరించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి డీఐఎల్ఆర్‌ఎంపీ అన్ని జిల్లాలకు విస్తరింపజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సమాచార మరియు ప్రజా సంబంధాల శాఖ తెలిపింది.

పర్లాకిమిడి: రాష్ట్రంలోనే గిరిజనులకు అత్యధికంగా అటవీ భూముల పట్టాలు మంజూరు చేసినందుకు గానూ గజపతి జిల్లాకు భూమి సమ్మాన్ అవార్డును కేంద్రం ప్రకటించింది. దీనిలో భాగంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అదనపు జిల్లా కలెక్టర్ (రెవెన్యూ) బీరేంద్ర కుమార్ దాస్ అవార్డును మంగళవారం అందుకున్నారు. కార్యక్రమంలో పర్లాకిమిడి సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, తహసీల్దార్ నారాయణ బెహరా పాల్గొన్నారు.

రాయగడ: భూ రికార్డుల డిజిటలైజేషన్‌లో భాగంగా జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక భూమి సమ్మాన్ అవార్డును ప్రకటించింది. అవార్డును రాష్ట్రపతి చేతులమీదుగా కలెక్టర్ సింగ్ అందుకున్నారు. ఈ ఏడాది నుంచే ప్రవేశపెట్టిన ఈ అవార్డు రాయగడ జిల్లాకు రావడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

కొరాపుట్: జిల్లాలోని ఉన్నతాధికారులకు భూమి సమ్మాన్ అవార్డు లభించింది. కొరాపుట్ జిల్లా ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్, సబ్ కలెక్టర్ వేణుధర్ సబర్, కోట్‌పాడ్ తహసీల్దార్ శక్తి మహాపాత్రోలు రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. భూ పట్టాల ఆధునికీకరణలో విశేష సేవలు చేసినందుకు ఈ అవార్డు లభించింది. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

25 నుంచి రాష్ట్రపతి పర్యటన

- సమీక్షించిన చీఫ్ సెక్రటరీ ప్రదీప్ కుమార్ జెనా



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 3వసారి రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్నారు. ఆమె పర్యటన ఈనెల 25 నుంచి ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో భద్రతా ఇతరేతర అనుబంధ ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా ప్రత్యక్షంగా సమీక్షించారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో ఆయన అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో రాష్ట్ర పర్యటన సన్నాహాల అనుబంధ విభాగాలు, శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పర్యటన వివరాలు

రాష్ట్రపతి ఈనెల 25న రాష్ట్రానికి విచ్చేసి స్థానిక రాజ్ భవన్‌లో బస చేస్తారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక దళిత వర్గాల (పీవీటీజీ) ప్రతినిధులతో సమావేశమవుతారు. తర్వాత రోజు 26న రాష్ట్రపతి రోజంతా కటక్‌లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. జాతీయ మ్యూజియంగా రూపాంతరం చెందిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరియు మధుసూదన్ దాస్‌ల జన్మస్థలాలు సందర్శించి స్థానిక చండీ ఆలయానికి వెళ్తారు. పర్యటనలో భాగంగా ఒడిశా హైకోర్టు 75వ వార్షికోత్సవ వేడుకలో పాల్గొంటారు. అనంతరం నేషనల్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తారు. తదుపరి ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రి వార్షికోత్సవంలో పాల్గొంటారు. అనంతరం మూడో రోజు 27న ఉదయం టొమాండోకు దగ్గరగా ఉన్న దస్‌బటియా బ్రహ్మకుమారి సెంటర్‌లో లైట్‌హౌస్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఆమె భద్రక్ ఆటానమస్ కళాశాల వజ్రోత్సవ వేడుకలకు హాజరై తిరిగి న్యూఢిల్లీకి పయనమవుతారు. దేశ అత్యున్నత పదవిని చేపట్టిన తర్వాత ఆమె వరుసగా మూడోసారి రాష్ట్రానికి విచ్చేయనున్నారు. రాష్ట్రపతి పర్యటన ఉన్నత స్థాయి సన్నాహక సమావేశానికి అదనపు ప్రధాన కార్యదర్శి నికుంజ్ కిషోర్ ధల్, డీజీపీ సునీల్ కుమార్ బన్సల్, భువనేశ్వర్ – కటక్ జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి, రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శాస్వత్ మిశ్రా, రాష్ట్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి షాలినీ పండిట్ తదితరులు హాజరయ్యారు.

'తొలగింపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి'



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్ అసిస్టెంట్ ఇంజినీర్(సివిల్) కార్యాలయానికి ఆనుకొని ఉన్న అతి పురాతన సిద్ధవీర హనుమాన్ మందిరం తొలగింపునకు గతేడాది ఆగస్టు 20వ తేదీన ఈస్టుకోస్టు రైల్వే డివిజన్ వాల్తేరు అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే పర్లాకిమిడి స్టేషన్ పర్యవేక్షణకు ఈస్టుకోస్టు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం అనూప్ శతపతి మంగళవారం విచ్చేశారు. దీంతో పర్లాకిమిడి ఎమ్మెల్యే కె.నారాయణ రావు రాసిన వినతిని బీజేపీ జిల్లా కార్యదర్శి ఈ.ప్రశాంత్, యువజన మోర్చా అధ్యక్షుడు కోట్ల యువరాజ్, జగన్నాథ మహాపాత్రో, భజరంగ్‌దళ్ సభ్యుడు లోకనాథ మిశ్రాలు డీఆర్‌ఎంకు అందజేశారు. ఈ ఆలయం 19వ శతాబ్దం నుంచి ఉందని చరిత్ర చెబుతోందని, ఎటువంటి రైల్వే స్థలం ఆక్రమించలేదని వినతిలో పేర్కొన్నారు. అందువలన హనుమాన్ మందిరం తొలగింపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కోరారు.

రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖకు ప్రథమ బహుమతి



భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) రాష్ట్ర శాఖకు దేశవ్యాప్తంగా ప్రథమ బహుమతి లభించింది. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం జరిగిన ఐఆర్‌సీఎస్ వార్షికోత్సవంలో నిధుల సేకరణ మరియు సభ్యత్వం వర్గం కింద రాష్ట్రం ప్రథమ బహుమతి సాధించినట్లు తెలియజేశారు. అవార్డును భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ గణేషీలాల్ అందుకున్నారు. ఆయనతో పాటు ఐఆర్‌సీఎస్ రాష్ట్ర శాఖ కార్యదర్శి ఉన్నారు.

\- భువనేశ్వర్

బైక్ దొంగ అరెస్టు



దొంగలించిన బైక్‌తో నిందితుడు

జయపురం: రెండు రోజుల క్రితం బైక్ దొంగలించిన వ్యక్తిని జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం పోలీసు అధికారి తెలిపిన వివరాల మేరకు... పారాబెడ అరవిందనగర్ ఝుంకరదేవి మందిరం మొదటి లైన్ వెనుక వీధిలో ఆనంద్ చంద్ర ఓజా తన ఇంటి ముందు ఈనెల 8వ తేదీన రాత్రి 8 గంటలకు బైక్ పార్క్ చేశాడు. అనంతరం ఇంటి లోపలికి వెళ్లి 10 నిమిషాల్లో బయటకు వచ్చిన అతడిని బైక్ కనిపించలేదు. వెంటనే పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించి సీసీ కెమేరా ఫుటేజ్ పరిశీలించి, బైక్ దొంగలించిన పారాబెడ సంతోషిమా నగర్‌కు చెందిన తాపసరంజన్ సాహు ఉరఫ్ కృష్ణ(27)ను అరెస్టు చేశారు. దొంగిలించిన బైక్ భూతనాథ్ మందిరం వెనుక శ్మశాన ప్రాంతంలో దాచి, తర్వాత అమ్మాలని భావించానని అతను వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బిష్ణు మదకామి వెల్లడించారు.

బొలేరో వాహనం బోల్తా

- ముగ్గురికి గాయాలు



గాయపడిన కౌశిల్ అధికారి



గాయపడి చికిత్స పొందుతున్న సంగీత అధికారి

జయపురం: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితిలోని ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వరున్ని సోమవారం దర్శించుకొని, తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న భోల్‌భం భక్తుల బొలేరో వాహనం బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మల్కన్‌గిరి జిల్లాలోని ఎంవీ 29 గ్రామానికి చెందిన కొంతమంది భక్తులు బొలేరో వాహనాన్ని అద్దెకు మాట్లాడుకొని దైవ దర్శనానికి గుప్తేశ్వర్‌కు సోమవారం వెళ్లారు. అక్కడ దర్శనం అనంతరం తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో భానుమతి అధికారి, సంగీత అధికారితో పాటు మరొకరు గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను రక్షించి బలిమెల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఒర్కెల్ పోలీసు అధికారి రఘునాథ్ మరిఖ సూచన మేరకు ఎస్ఐ బిభూతభూషణ సుతార్ సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు.

క్లుప్తంగా

చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా అఫీస్‌నాయుడు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ నిర్వహించిన నియామకాల్లో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్‌గా కొమరావు అఫీస్‌నాయుడిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీనియర్ న్యాయవాదిగా, మూడుసార్లు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలందించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఉచితంగా లీగల్ సేవలు అందిస్తానన్నారు. ఈయన నియామకం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, పొన్నాడ వెంకటరమణ, వాన కృష్ణచంద్, తంగి శివప్రసాదరావు, బెజ్జిపురపు ఫల్గుణరావు, చంద్రమౌళి, పొలిశెట్టి మల్లిబాబు, కిల్లారి ఈశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

ఆదిత్యుని సన్నిధిలో డీఎఫ్‌ఓ



నిషాకుమారికి జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జిల్లా అటవీ శాఖాధికారి, ఐఎఫ్ఎస్ అధికారి నిషాకుమారి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆమెకు ఘన స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో అర్చకులు సాందీప్‌శర్మ, సిబ్బంది బి.ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

టెక్కలి రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొల్లి ఎల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో డి.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో 8వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1934లో ఏర్పడిన వ్యవసాయ కార్మిక సంఘం నేడు దేశవ్యాప్తంగా విస్తరించి కోటికి పైగా సభ్యులు ఉన్న సంఘంగా ఎదిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా డి.నీలవేణి, బి.మల్లేష్, మరో 10మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శాంతిభద్రతలు పరిరక్షించాలి



నిరసన తెలియజేస్తున్న క్రైస్తవులు

శ్రీకాకుళం కల్చరల్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులకు భద్రత కల్పించాలని, మతసామరస్యం వర్ధిల్లేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కమిటీ సభ్యులు నినదించారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం పాతబస్టాండ్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గరికి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లను అరికట్టి శాంతిభద్రతలను పరిరక్షించాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఓంపూరు రమేష్ మాట్లాడుతూ దాడులు అరికట్టే దిశగా ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పైడి మోజేస్ రాజు, జాయింట్ సెక్రటరీ ఆర్.సాల్మన్‌రాజ్, కోశాధికారి ఎల్.రమేష్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ సందర్శన

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌ను తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ డీఆర్ఎం అనూప్‌శత్పథీ మంగళవారం సందర్శించారు. గుణుపూర్ వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆయన ప్రత్యేక రైల్లో మధ్యాహ్నం 12 గంటల సమయంలో శ్రీకాకుళం రోడ్‌లో దిగారు. ఈ సందర్భంగా ఆమదాలవలసకు చెందిన కొందరు రైల్వేస్టేషన్‌లోని సమస్యలను ఆయన ముందుంచారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మెట్టక్కివలస వైపు ఉన్న గూడ్స్ షెడ్ వరకు పొడిగించాలని కోరారు. ప్లాట్‌ఫాం పైకప్పు పూర్తి స్థాయిలో వేయాలని కోరారు. స్టేషన్ వెలుపల ఉన్న దుకాణాలు గత ఏడాది ఎవరి పేరు మీద ఉన్నాయో అదే పేర్లతో రెన్యువల్ చేయాలని వ్యాపారులు విన్నవించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి, ఏఈఎన్ బీవీఎస్ మూర్తి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తాపా, వర్తకులు, రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఎమ్మెల్యే బాహినీపతి ఆగ్రహం



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ సస్మిత మెలకా తదితరులు

కొరాపుట్: స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మిత మెలకా అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో అధికారులపై జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహీనీపతి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో కొందరు ఉపాధ్యాయుల తీరు తీవ్ర ఆక్షేపణీయంగా ఉందని మండిపడ్డారు.

ఒక చోట గిరిజన బాలికను ఉపాధ్యాయుడు ప్రేమపేరుతో పట్టుకుపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోచోట తప్పతాగి ఉపాధ్యాయుడు పాఠశాలకు వెళ్లిన విషయం గుర్తు చేశారు. ఉపాధ్యాయ వ్యవస్థపై వస్తున్న విమర్శలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అటవీ శాఖ అధికారులు తీవ్ర అవినీతిపరులుగా మారారని ఆరోపించారు. కొరాపుట్ జిల్లాలో వీరి అవినీతి తారాస్థాయికి చేరిందన్నారు. వన యజ్ఞంకి ప్రజాప్రతినిధులను పిలిస్తే తమ బండారం బయటపడుతుందని పిలవడం లేదన్నారు. 5,000 మెక్కలు నాటామని చెప్పి, 500 మెక్కలు నాటుతున్నారని ఆరోపించారు. జయపురంలో విక్రమ్ దేవ్ యూనివర్సిటీ కొత్తగా ఏర్పడుతున్నందున అక్కడ మొక్కలు నాటాలని చేసిన విజ్ఞప్తి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు లేనిచోట వైద్యశాలల నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్ మాట్లాడుతూ ఉద్యానవన, మైనర్ ఇరిగేషన్, అటవీ శాఖ అధికారుల సమన్వయంతో వనయజ్ఞం నిర్వహిస్తామని తెలియజేశారు. జిల్లా వైద్యరంగంలో అభివృద్ధి జరుగుతోందని తెలియజేశారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో శరవేగంగా అభివృద్ధి జరగాలని సూచించారు.

సమావేశంలో నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాడీ, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ, కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మినీ దియాన్ తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభించిన డీఆర్ఎం



చిల్డ్రన్స్ పార్క్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం శతపతి

రాయగడ: స్థానిక రైల్వే విభాగం కార్యాలయం సమీపంలో కొత్తగా నిర్మించిన చిల్డ్రన్స్ పార్క్‌ను విశాఖపట్నం రైల్వే డీఆర్ఎం అనూప్ కుమార్ శతపతి మంగళవారం ప్రారంభించారు. రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించేందుకు రాయగడ పర్యటనకు వచ్చిన ఆయన, ఈ సందర్భంగా పిల్లలకు ఆహ్లాదం కలిగించే పార్క్‌ను ప్రారంభించారు. అంతకుముందు మాట్లాడుతూ.. రైల్వే డివిజన్‌గా గుర్తింపు పొందిన రాయగడ త్వరలో కార్యాలయాలు, విస్తరణ పనులు చురుగ్గా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కూలిన ఫ్లై ఓవర్



ఫ్లై ఓవర్ కుప్పకూలిన దృశ్యం



కుప్పకూలిన పరిస్థితి

భువనేశ్వర్: జాజ్‌పూర్ జిల్లా రసూల్‌పూర్ మండల కేంద్రం సమీపంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్‌లో ఒక భాగం కుప్పకూలిపోయింది. దీంతో మంగళవారం ఉదయం ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 10 అడుగుల పొడవు ఉన్న వంతెన ఒక భాగం కూలిపోయిందని స్థానికుల తెలియజేస్తున్నారు. వంతెన కుప్పకూలిన విషయం తొలుత స్థానికులే గుర్తించారు. అదృష్టవశాత్తు ఆ సమయంలో వాహనాలు వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. నేషనల్ హైవే అథారిటీ అధికారులు, స్థానిక యంత్రాంగం ఘటనాస్థలికి చేరుకుని ఫ్లై ఓవర్ కూలిపోవడానికి కారణంపై దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పాణికొయిలి, చండిఖోల్ మధ్య ఉన్న జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నియంత్రించారు.

మల్కన్‌గిరి జిల్లాలో భారీ వర్షాలు

మల్కన్‌గిరి: జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలతో కోరుకోండ సమితి తర్లకోట్ట గ్రామం వద్ద నిర్మించిన వంతెన రోడ్డుపై మూడు అడుగుల నీరు ప్రవహిస్తోంది. అలాగే పాత్రోగూడ సమీపంలోని ఇళ్లపై చెట్లు పడిపోయాయి. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్ర 5 గంటలు వరకు విద్యుత్ సేవలను నిలిపివేసి ఓడ్రాఫ్ బృందం చెట్లను తొలగించారు. ఇళ్లు నష్టపోయిన వారికి నష్ట పరిహారం అందజేస్తామని జిల్లా గిరిజన అభివృద్ధి అధ్యక్షుడు అడ్మార్వా ప్రకటించారు. వారిని ప్రస్తుతం పునరావాస కేంద్రంలో ఉంచారు.



వంతెన వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



పాత్రోగూడ వద్ద ఇళ్లపై పడిన చెట్టు



చెట్లను తొలగిస్తున్న ఓడ్రాఫ్ బృందం

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

జయపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జయపురం రోటరీ క్లబ్, సోషియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ అసోసియేషన్(సీవా)లు సంయుక్తంగా పట్టణంలోని పలుచోట్ల మొక్కలను మంగళవారం నాటాయి. మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని సూచించారు. జి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీవా అధ్యక్షుడు సుధాకర పట్నాయక్, కార్యదర్శి సౌమ్యరంజన్ దొళాయి, ఉపాధ్యక్షుడు విశ్వజిత్ మిశ్ర, సహాయ కార్యదర్శి గోపాల సాహు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు అశోక్ మిశ్ర, రత్నాకర చౌదరి, సురేష్ పాణిగ్రహి పాల్గొన్నారు.

నగరంలో 'చల్లదనం'



పెద్దరెల్లివీధిలో తప్పెటగుళ్లు



విద్యుద్దీపాలంకరణ



ఆకట్టుకున్న వేషధారణ

ఓవైపు వాతావరణంలో చల్లదనం.. మరోవైపు అమ్మవార్లకు చల్లదనం కార్యక్రమాలతో శ్రీకాకుళం నగరంలో సందడి నెలకొంది. ఆషాఢమాస ఆఖరి మంగళవారం సందర్భంగా పాలకొండ రోడ్డులోని పెద్దరెల్లివీధి, కెల్లవీధి, రెల్లివీధి తదితర ప్రాంతాల్లో మహిళలు కలశాలతో వెళ్లి అమ్మవార్లకు చల్లదనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పువాయిద్యాలు, కోలాటం, తప్పెటగుళ్లు, వేషధారణలు ఆకట్టుకున్నాయి. మంత్రి ధర్మాన ప్రసాదరావు పెద్దరెల్లివీధిలోని అమ్మవారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్



కాకివీధిలో ముత్యాలమ్మతల్లికి పూజలు

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం సభ్యులు

జయపురం: పట్టణంలోని లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికలు సోమవారం జరిగాయి. మీనకేతన దాస్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో రోటరీ ప్రాంతీయ చైర్మన్ జి.వసంతరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మురళీమోహన్ పట్నాయక్‌ను అధ్యక్షుడిగా, జగన్నాథ్ శతపతి సాధారణ కార్యదర్శిగా, లాల్‌మోహన్ పట్నాయక్ ఉపాధ్యక్షుడిగా, కె.లక్ష్మణరావును కోశాధికారిగా ఎన్నుకున్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

కాశీబుగ్గ:

రాష్ట్ర ప్రభుత్వం జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి ఆర్‌బీకేలలో కొనుగోలు చేయాలని రైతు సంఘ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.తులసీదాస్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ సంత మైదానంలో మంగళవారం నిర్వహించిన జీడిరైతుల మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ 2019 నుంచి అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు రూ.100 నుంచి రూ.150 వరకు పెరిగాయని, జీడిపప్పుకు రేటు పెరుగుతుంది తప్ప రైతు పండిస్తున్న పంటకు ధర పెరగడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, కె.మోహనరావు మాట్లాడుతూ జీడి రైతులు గిట్టుబాటు ధర లేక దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని, జీడి పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మెట్టూరు ఎంపీటీసీ కొండప్ప సురేఖ, మందస నాయకులు మట్ట ఖగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.లక్ష్మినారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్.గణపతి, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.రామారావు, వి.మాధవరావు, టెక్కలి రైతాంగ సాధన సమితి నాయకులు ఎం.రామారావు, భీమారావు, వెంకన్న, ఎస్.కాంతారావు, బి.రమాదేవి, కె.వినోద్, వి.రామకృష్ణనాయుడు, కె.హేమారావు చౌదరి, జె.ప్రసాద్, అంబటి రామకృష్ణ, కుసుమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు

నూతన ఆవిష్కరణలతోనే ప్రగతి



సెమినార్ సంకలనం విడుదల చేస్తున్న ప్రొఫెసర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత విద్యలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలతోనే ప్రగతి సాధ్యమవుతుందని తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విద్యలో వినూత్న ఆధునిక పద్ధతులు అమలు అనే అంశంపై జరగనున్న రెండు రోజుల సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయంగా వస్తున్న విద్యా మార్పులను గమనిస్తుండాలని చెప్పారు. రీసెర్చ్ ఆర్టికల్స్, ప్రాజెక్టులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కరిక్యులమ్ నిర్వహణలో మార్పులు అవసరమని చెప్పారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. వర్సిటీ విద్యలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అనంతరం సెమినార్ సంకలనం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, టెక్నో హబ్ వీఐటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు అబ్రహం సునీల్, ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రొఫెసర్ మాధవి, ప్రొఫెసర్ కె.వేణుగోపాల్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ నీలం సంతోష్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ఇచ్ఛాపురం: పట్టణంలో వక్ఫ్ బోర్డు స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని వక్ఫ్ బోర్డు అధికారులు షేక్ సిద్దిక్ రియాజ్ ఖాన్ హెచ్చరించారు. ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా 197/4 సర్వే నంబర్ గల 3.75 ఎకరాల వక్ఫ్ బోర్డు స్థలంలో అనధికార కట్టడాలను అధికారులు మంగళవారం కూల్చివేశారు. కార్యక్రమంలో హజరత్ యూసఫ్ తకియా దర్గా కమిటీ అధ్యక్షుడు, ప్రతినిధులు హెచ్ఎం అబ్దుల్లా, అబ్దుల్ మన్నన్, ఎండీ ఇర్షాన్, ఎస్‌కే షర్ఫురాజ్, మస్తాన్ షరీఫ్, ప్రేమ్ సరత్‌రాజ్‌ఖాన్, అలీమ్‌ఖాన్ ముస్లిం పెద్దలు జోహార్ ఖాన్, ఎండీ ఫర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

'పవన్ తీరు సరికాదు'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఐ అంజూయాదవ్ విధుల్లో భాగంగా జనసేన కార్యకర్తల ధర్నాను అడ్డుకుంటే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చిత్తూరు ఎస్పీకి ఫిర్యాదు చేయడం తగదని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణయాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓ కానిస్టేబుల్ కొడుకుగా ఉన్న పవన్‌కల్యాణ్‌కు పోలీసులు తమ విధులు ఎలా నిర్వహిస్తారో తెలియదా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో తహసీల్దార్ వనజాక్షిపై చింతమనేని దాడి చేసినప్పుడు నోరుమెదపని పవన్ ఇప్పుడు ఓ మహిళా సీఐపై చర్యలు తీసుకోవాలని కోరడం తగద న్నారు. యాదవ కులానికి చెందిన మహిళ అనే పవన్‌కు చిన్నచూపు అని మండిపడ్డారు.

క్లుప్తంగా

110 మంది బాధితులకు మొబైల్స్ అందజేత



బాధితులకు ఫోన్‌లు అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు గతేడాది ప్రారంభించిన వెబ్‌పోర్టల్, వాట్సాప్ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 110 మంది బాధితులకు ఎస్పీ ఎం.దీపిక మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రికవరీ చేసిన ఫోన్‌లు అందజేశారు. గత నెలలో పోగొట్టుకున్న ఫోన్‌లను ట్రేస్ చేసి చాలా తక్కువ వ్యవధిలోనే తిరిగి తమకు అప్పగించిన ఎస్పీకి, సైబర్ సెల్ పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్బీ సీఐ ఈ.నరసింహమూర్తి, సైబర్ సెల్ ఎస్సై ప్రశాంత్ కుమార్, కానిస్టేబుల్స్ వాసుదేవ్, శ్రీనివాసరావు, తిరుపతిరావు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

28 మద్యం బాటిల్స్ స్వాధీనం

గుర్ల: మండలంలోని పెనుబర్తిలో అక్రమంగా బెల్ట్ షాపు ద్వారా మద్యం అమ్మకాలు చేస్తున్న నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి 28 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు నాయుడు తెలిపారు. ఎవరైనా మండలంలో అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

7.4 కేజీల గంజాయి..

పాచిపెంట: ఒడిస్సా నుంచి ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒడిశాలోని కుర్లెల్లపాడు ప్రాంతానికి చెందిన మజ్జి లచ్చన్న ఆ రాష్ట్రంలోని రాజుగూడ గ్రామం నుంచి గంజాయి తీసుకుని ఆర్టీసీ బస్సులో సాలూరు వెళ్తుండగా పట్టుకున్నామన్నారు. 7.4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నాటు తుపాకులతో ఇద్దరి అరెస్టు

బొండపల్లి: అక్రమంగా రెండు నాటు తుపాకులు కలిగి ఉండడంతో పాటు కారులో తరలిస్తుండగా పట్టుబడడంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్.రవి తెలిపారు. కేసుకు సంబంధించి ఎస్సై రవి మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని దాసన్నపేటకు చెందిన శిరువూరి వెంకటరమణమూర్తితో పాటు, ద్వారపూడికి చెందిన పాకలపాటి వరహాలబాబు రెండు నాటు తుపాకులు కారు డిక్కీలో ఉంచి వస్తుండగా అంబటివలస గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కేసు విచారణ చేపట్టారు.


ఎరువుల స్టాక్ సీజ్

బలిజిపేట: మండలంలోని పి.రావివలసలో అనుమతులు లేకుండా అనధికారికంగా ఎరువులు విక్రయిస్తున్న షాపుపై నిఘా విభాగ అధి కారులు దాడిచేసి రూ.2,70,282 విలువ చేసే ఎరువుల స్టాకును సీజ్ చేశారు. ప్రాంతీయ నిఘా విభాగ శ్రీకాకుళం అధికారి ఆర్.అప్పలనాయుడు, మండల వ్యవసాయ శాఖ అధికా రులు ఈ దాడిలో పాల్గొన్నారు. అనధికారికంగా ఎరువులు విక్రయిస్తున్న వారిపై 6-ఎ కేసు నమోదుచేసినట్లు అధికారులు సందర్భంగా తెలిపారు. అదేవిధంగా బలిజిపేటలో కె.సతీష్‌కుమార్ ఎరువుల షాపులో తనిఖీ చేసి రూ.28,994 విలువ చేసే సరుకు అమ్మకాలు నిలుపుదల చేశామని చెప్పారు. కార్యక్రమంలో పార్వతీపురం సబ్ డివిజన్ ఏడీఏ వెంకటేష్, పార్వతీపురం ఏఓ ఎం.అశోక్, బలిజిపేట ఏఓ శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీ: క్లీనర్‌కు గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం స్వీట్ హోం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొనడంతో ఓ లారీ క్లీనర్‌కు గాయాలైనట్లు ఎస్సై శిరీష తెలిపారు. గజపతినగరం నుంచి రామభద్రపురం వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో లారీ ముందు భాగం నుజ్జు.నుజ్జయి క్లీనర్‌కు గాయపడడంతో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

ఆశ వర్కర్ల ఆందోళన



ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

విజయనగరం ఫోర్ట్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు బొత్స సుధారాణి మాట్లాడుతూ ఆశ వర్కర్లు జీతాలు పెంచాలన్నారు. పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఆశ వర్కర్లపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డీఆర్ఎం పర్యటన



డీఆర్ఎంను కలిసిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



రైల్వేస్టేషన్ పరిసరాల్లో పర్యటిస్తున్న డీఆర్ఎం అనుప్ శతపతి

విజయనగరం టౌన్/చీపురుపల్లి: ఈస్ట్‌కోస్ట్ డీఆర్ఎం అనుప్ శతపతి మంగళవారం మధ్యాహ్నం విజయనగరం జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. గుణుపూర్, నౌపడ, విజయనగరం, రాయగడ సెక్షన్ల పరిధిలో నిర్వహించిన ఆయన పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో విజయనగరం చేరుకున్న ఆయన రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైల్వేకోచ్ రెస్టారెంట్‌ను పరిశీలించారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. డీఆర్ఎం వెంట ఎస్ఇఈ కోఆర్డినేషన్ ఎకె.మహారాణా, ఎస్‌డీఓ మేనేజర్ జి.సునీల్ కుమార్, సీనియర్ డీసీఎం ఏకే .త్రిపాఠి, ఎస్‌డీఎస్సీ సీహెచ్. రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఎంను కలిసిన ఎంపీ బెల్లాన

వాల్తేరు డివిజన్‌లో ఇంతవరకు డీఆర్ఎంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న అనూప్ కుమార్ శతపతిని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కలిశారు. మంగళవారం భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం ప్రత్యేక రైలులో వెళ్తున్న డీఆర్ఎంను చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి వాల్తేరు డివిజన్‌లో చక్కని సేవలు అందించినందుకు ఆయనను సత్కరించారు.

డీఆర్ఎమ్‌కు వినతిపత్రం


పార్వతీపురంటౌన్: పార్వతీపురం రైల్వేస్టేషన్‌ను డీఆర్ఎం అనూప్ శతపతి తనిఖీ చేసి రెల్వేస్టేషన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు బెలగాంలో ప్రస్తుతం ఉన్న రైల్వే గేటు దగ్గర అండర్ పాసేజ్ కానీ ఫ్లెటైవర్ కానీ నిర్మించాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు వారణాసి శ్రీహరి, మరడాన తవిటినాయుడు జామి శ్రీనివాసరావు పొట్నూరు పైడిరాజు, గోర్ల పద్మావతి, యాండ్రాపు శ్రీనివాస్ నాయుడు, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లికి పుష్పాలంకరణ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు తదితరులు శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

ఘనంగా చండీయాగం

కోరిన కోర్కెలుతీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి చండీయాగం స్థానిక మూడు లాంతర్లు వద్ద నున్న అమ్మవారి ఆలయం ఆవరణలో వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్, శంబర కృష్ణ, మంగళవారం ఘనంగా నిర్వహించారు.



ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.

పట్టు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

- పరిశ్రమల శాఖ ఎ.డి ఏవీ సాల్మన్‌రాజు



పట్టు పరిశ్రమలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా పరిశ్రమల శాఖ ఎ.డి ఏవీ సాల్మన్‌రాజు

తెర్లాం: గ్రామాల్లో తక్కువ ఖర్చుతో పట్టు పరిశ్రమలు ఏర్పాటు చే సుకునేందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏవీ సాల్మన్‌రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు తెర్లాం మండలంలోని ఆమిటి గ్రామ సచివాలయంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులు గ్రామాల్లో పట్టు పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. పట్టు పరిశ్రమల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. పట్టు పరిశ్రమలను ఏర్పాటు చేసి, పట్టు పురుగులను పెంచేందుకు అవసరమైన మల్బరీ తోటలను తమ సొంత భూముల్లో పండించుకోవచ్చని తెలిపారు. గ్రామాల్లో పట్టు పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకువచ్చే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, ఆసక్తి ఉన్న రైతులంతా పట్టు పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. మండలంలో పట్టు పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే రైతులు పట్టు పరిశ్రమల శాఖ అధికారులనుగానీ, రైతు భరోసా కేంద్రాల్లోగానీ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ అధికారులు, స్థానిక రైతులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి

- ఎంపీ బెల్లానకు వినతి



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా శిష్టకరణ సంఘం ప్రతినిధులు

చీపురుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శిష్టకరణాలకు ఇప్పటికే ఓబీసీ రిజర్వేషన్ వర్తిస్తోందని, దీంతో పాటు కేంద్రంలో కూడా శిష్టకరణాలకు ఓబీసీ రిజర్వేషన్ వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను జిల్లా శిష్టకరణ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఎంపీ నివాసంలో ఆయనను జిల్లా శిష్టకరణ సంఘం గౌరవ అధ్యక్షుడు రేగులవలస ఆనంద్ పట్నాయక్ ఆధ్వర్యంలో మండల సంఘం ప్రతినిధులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిష్టకరణాలను కేంద్రం ఓబీసీలో చేర్పించే విధంగా త్వరలో జరగనున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రస్తావించాలని కోరారు. గతంలో ఓసీలో ఉన్న శిష్టకరణాలను దివంగత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి బీసీల్లో చేర్చారని చెప్పారు. అంతేకాకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో శిష్టకరణాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి మంచి గుర్తింపు ఇచ్చారన్నారు. అయితే శిష్టకరణాలకు చెందిన విద్యార్థులు, యువత ఉద్యోగాలు, ఇతర రిజర్వేషన్ల కోసం కేంద్ర ఓబీసీ ఎంతో అవసరమన్నారు. అందుకనే పార్లమెంటులో చర్చించి ఓబీసీలో చేర్పించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కోశాధికారి వాండ్రంగి వెంకటేష్, ఉపాధ్యక్షుడు ఎల్.ప్రభాత్, చీపురుపల్లి మండల సంఘం అధ్యక్షుడు రఘుపాత్రుని శివ, ఉపాధ్యక్షుడు రఘుపాత్రుని శ్రీను, కోశాధికారి కుప్పిలి శ్రీను, సలహాదారు సీహెచ్.కేశవరావు, జాయింట్ సెక్రటరీ ఉరిటి రమణ, గరివిడి సంఘం నాయకులు ప్రతాపరావు కృష్ణ, ఎం.సత్యనారాయణ, దొంకాడ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతకు ఆర్థిక ప్రోత్సాహం



విజేత పల్లవిని అభినందిస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి

విజయనగరం అర్బన్: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఇటీవల జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో బంగారు, రజత పతకాల విజేత ఎస్. పల్లవికి ఆమె చదువుతున్న సత్య కళాశాల యాజమాన్యం రూ.30 వేల నగదు ప్రోత్సాహం అందజేసింది. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సత్య విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, డైరెక్టర్ ఎం.శశిభూషణరావు ఆమెకు నగదు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సాయిదేవమణి, వైస్ ప్రిన్సిపాల్ సత్యవేని, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొని పల్లవిని అభినందించారు.

23న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విజయనగరం: విశ్వ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 23న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతలపూడి త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో విశ్వ కళాపరిషత్, గురజాడ బ్రాహ్మణ సమాఖ్య, నా ఊరు విజయనగరం, వనితా వాకర్స్ క్లబ్, తిలక్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈనెల 23న కణపాక యూత్ హాస్టల్‌లో పర్యావరణం-చెరువుల పరిరక్షణ, సమాజంపై అవినీతి ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిసున్నట్లు పేర్కొన్నారు. 5,6,7, తరగతుల విద్యార్థులకు సమాజంపై అవినీతి ప్రభావం అనే అంశంపైన, 8,9,10 తరగతుల విద్యార్థులకు పర్యావరణం- చెరువుల పరిరక్షణ ఆవశ్యకత అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ రెండు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, మరో పదిమంది విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులు ఇవ్వడంతోపాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్, పెన్ను, శతక పద్యాల పుస్తకం బహూకరిస్తామన్నారు. వ్యాసరచన పోటీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై 11 గంటలకు ముగుస్తుందన్నారు. పోటీలో పాల్గొనదలచిన విద్యార్థులు ఫోన్ 9866474519 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాసరచన తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో రాయవచ్చునన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరూ ఈ పోటీలో పాల్గొనేందుకు అర్హులేనని వివరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ సూర్యకుమారి

భోగాపురం: విద్యార్థినులు చట్టాలు, ఆత్మరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సూర్యకుమారి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలు, ఆత్మరక్షణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యపై దృష్టి సారించి నిర్దేశించుకున్న లక్ష్య సాధనకై నిరంతరం శ్రమించాలన్నారు. సమాజంపై సరైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సామాజిక మాధ్యమాల వినియోగంపై అప్రమత్తతతో వ్యవహరించాలని, అవసరం మేరకు మాత్రమే వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవరికైనా ఏమైన సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులను సంప్రదిస్తే వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

థాంక్యూ సీఎం సార్

శృంగవరపుకోట: ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే కాకుండా హయ్యర్ పెన్షన్, ఇతర సదుపాయాలు కల్పించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆర్టీసీ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో థాంక్యూ సీఎం సార్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సీఎం జగన్ ఫొటోకు ఆర్టీసీ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. ఆర్టీసీ అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి తగ్గట్టుగా పనిచేస్తామని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. డిపో మేనేజర్ కె.రమేష్, ట్రాఫిక్, గ్యారేజ్, ఆఫీస్, సెక్యూరిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పూసపాటిరేగ: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారి కొల్లి నీలిమ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. మండలంలోని పేరాపురంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. విత్తనాల శాంపిల్స్‌ను పరిశీలించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పీ ధరలు కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా అవసరం

- కలెక్టర్ నాగలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: కచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలని ఈఆర్ఓలను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నాగలక్ష్మి జిల్లాలో సవరణ ప్రక్రియ పురోగతిని వివరించారు. అనంతరం జిల్లాలోని ఈఆర్ఓలను ఉద్దేశించి మాట్లాడారు. ఫారమ్ 6, 7, 8లపై సమీక్షించారు. ఓట్ల చేర్పులు, తొలగింపులకోసం వచ్చిన దరఖాస్తులన్నిటినీ భద్రపరిచి, రికార్డులని ట్టీని పక్కాగా తయారు చేసి ఉంచాలని ఆదేశించారు. ఓటు తొలగించడానికి వచ్చిన దరఖాస్తుకు తప్పనిసరిగా నోటీసు ఇవ్వాలని ఆ నోటీసును కూడా భద్రపరచాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఓట్ల చేర్పులు 4 శాతం కంటే ఎక్కువ ఉన్నచోట, తొలగింపులు 2 శాతం కంటే ఎక్కువ ఉన్నచోట ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ప్రతి ఇంటికి డోర్ నంబర్ వేసేలా చూడాలని, జెడ్పీ సీఈఓ, డీపీఓలను ఆదేశించారు. ఈ నెల 21 నుంచి ఇంటింటి సర్వే చేసినపుడు, బీఎల్ఓతో పాటు పంచాయతీ కార్యదర్శికూడా వెళ్లాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ ఎం.గణపతిరావు, ఆర్డీఓలు ఎంవీ సూర్యకళ, ఎం.అప్పారావు, ఈఆర్ఓలు సుదర్శనదొర, సూర్యనారాయణ, పద్మలత, అప్పారావు, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, డీపీఓ శ్రీధరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టుకు దరఖాస్తులాహ్వానం

మెరకముడిదాం: మండలంలోని బోడందొరవలస అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులాహ్వానిస్తున్న ట్లు చీపురుపల్లి ఐసీడీఎస్ పీఓ కె.వి.ఎన్.ఆర్.రాజేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈపోస్టును బీసీ-ఇకి కేటాయించినట్లు పేర్కొన్నా రు. 10వతరగతి ఉత్తీర్ణులై, 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్న స్థానిక వివాహితలు రూల్ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.పూర్తి వివరాలకు చీపురుపల్లి ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఫిజియోథెరపీ సేవలపై అవగాహన

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫిజియోథెరపీ సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ జె.త్రినాధరావు మాట్లాడుతూ శారీరక, మానసిక సమస్యలు కూడా ఫిజియోథెరపీ ద్వారా నయమవుతాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామభద్రపురం: మండలంలోని నాయుడువలస గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు సంబంధించి, అర్హులైన ఓసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జూలై 01, 2023 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి, స్థానిక వివాహిత అయి ఉండి, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారై ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారితో సంతకం చేయించిన కులం, విద్యార్హత, వయసు, నివాసం వంటి ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

రామభద్రపురంలో దొంగలు పడ్డారు..



దొంగలు కోసేసిన షాపు పైభాగం

రామభద్రపురం: స్థానిక శివాలయం ఎదురుగా ఉన్న ఓ సూపర్ మార్కెట్‌లో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. షాపుపైనున్న ఐరన్ రూఫ్, సీలింగ్‌ను కోసేసి, షాపులోకి సులువుగా దిగారు. అందులోని నిత్యవసర సరుకులు, సౌందర్య సాధనాలను దొంగిలించారు. వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని, షాపు యజమాని చొక్కాపు వెంకటనాయుడు తెలిపారు. ఈ ఘటనపై షాపు యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అక్కడి సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు.

నేడు విత్తనాల కిట్ల పంపిణీ

బొండపల్లి: మండలంలో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విత్తనాల కిట్లను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధులు,ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలం నాయుడు, జెడ్పటీసీ రాపాక సూర్యప్రకాశరావు 15 రకాల వ విత్తనాలను ఎస్సీ రైతులకు ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు.

ఉద్దవోలు.. ప్రశాంతం..



ఉద్దవోలులో ఓ వీధిలో నెలకొన్న ప్రశాంత వాతావరణం

తెర్లాం: ఏగిరెడ్డి కృష్ణ మాస్టారు హత్యతో ఆయన స్వగ్రామం మండలంలోని ఉద్దవోలు బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానుల ఆందోళనలతో నిన్నమొన్నటి వరకు అట్టుడికిపోయింది. ఇప్పుడు గ్రామంలో శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయని, గ్రామం ప్రశాంతంగా ఉందని ఎస్ఐ ఆర్.రమేష్ మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ అయిన ఏగిరెడ్డి కృష్ణను ఆయన గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ పికెట్ నిర్వహించడంతో పాటు, 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. గ్రామంలో గత రెండు రోజులుగా ప్రశాంత వాతావరణం నెలకొందని, ప్రజలు కూడా సంయమనం పాటించారన్నారు. గ్రామంలో 13 మందితో పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తున్నామన్నారు.

ఎన్‌జీటీ ఆదేశాల మేరకు కాలుష్య నివారణ ప్రణాళిక

- పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ జారీ చేసిన ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణకు, పర్యావరణాన్ని కాపాడేందుకు జిల్లా పర్యావరణ ప్రణాళిక సిద్ధం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యావరణ ప్రణాళిక సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై కాలుష్యం ప్రభావం చూపుతుందని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కాలుష్యాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ సూచించిన ప్రమాణాల మేరకు సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంటి నుంచి వచ్చే చెత్త, మున్సిపాలిటీలు, పంచాయతీలలో ఘనవ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ చెత్త నిర్వహణ, భవన నిర్మాణాలు, పాత ఇళ్లు పడగొట్టడం వల్ల వచ్చే మెటీరియల్, ఆస్పత్రుల నుంచి వచ్చే బయో మెడికల్ వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలు, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం, నీటి నాణ్యత కోసం ప్రణాళిక, మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై శాఖల వారీగా తీసుకోవలసిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. జూలై నెలాఖరుకు జిల్లా పర్యావరణ ప్రణాళిక తయారుచేసి పంపించాలని స్పష్టం చేశారు. వాయు, శబ్ద కాలుష్యానికి సంబంధించి మొబైల్ ల్యాబ్ ద్వారా పట్టణంలో డేటా సేకరించాలని తెలిపారు. గాలి నాణ్యత పరీక్షించేందుకు శాశ్వతంగా పాత బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద పరికరాలు ఏర్పాటుచేయాలని కాలుష్య నియంత్రణ అధికారులను ఆదేశించారు. బయో మెడికల్ వ్యర్థాలను శాస్త్రీయంగా వేరుచేసి, ఆస్పత్రి ఆవరణలో నిల్వ చేసే ప్రదేశంలో కెమెరాలు అమర్చి వాటిని కాలుష్యనియంత్రణ మండలికి పర్యవేక్షణ కోసం అనుసంధానం చేయాలని చెప్పారు. ఆస్పత్రులలో రోజువారీ పడకల వివరాలు వాటి వల్ల ఉత్పన్నమయ్యే వ్యర్థాలను శాస్త్రీయంగా వేరుచేసి, తదుపరి వాటిని రెయిన్‌బో ఇండస్ట్రీకి అందజేయాలని, వాటి వివరాలను కూడా ఆస్పత్రి వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ పేర్కొన్నారు.

జూలై 25 నాటికి నివేదికలు అందజేయాలి

సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.వి.పద్మావతి మాట్లాడుతూ సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ వారి ఆదేశాల మేరకు మున్సిపాల్టీ, వైద్య ఆరోగ్య, గనులు పరిశ్రమల శాఖాధికారులు ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. దీనిలో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, సి- డి వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ ప్రణాళిక, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, నీటి నాణ్యత నిర్వహణ ప్రణాళిక, గృహ మురుగునీటి నిర్వహణ, పారిశ్రామిక మురుగునీటి నిర్వహణ ప్రణాళిక, ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ప్లాన్, మైనింగ్ కార్యకలాపాల నిర్వహణ ప్రణాళిక, శబ్ద కాలుష్య నిర్వహణ ప్రణాళికలకు సంబంధిత శాఖలు జూలై 25 నాటికి నివేదికలు అందజేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, నగర పాలక సంస్థ కమిషనర్‌లు రామ అప్పలనాయుడు, రాజు, ఇరిగేషన్ ఎస్‌ఈ, డిప్యూటీ డీఎంహెచ్ఓ, గ్రౌండ్ వాటర్, మైన్స్ అండ్ జియాలాజీ అధికారులు పాల్గొన్నారు.